క్లుప్తంగా

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండ



పెర్కిట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ, వారి అభివృద్ధికి కృషి చేస్తోందని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఆలూర్‌లో బుధవారం సొసైటీ నూతన చైర్మన్ తంబూర్ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనంతరం ఆలూర్‌లో రెండు, దేగాంలో ఒక చెక్‌డ్యామ్ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.3కోట్ల 19లక్షల నిధులను మంజూరు చేశారు. ఎంపీపీ పస్క నర్సయ్య, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్ని సమస్యలే



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి పేరుకే 100 పడకల ఆస్పత్రని, కానీ అందులో అన్ని సమస్యలే ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు వినయ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 45మంది వైద్యులు ఉండాల్సిండగా 15మంది వైద్యులు ఉన్నారని, అందులో డిప్యూటేషన్‌పై 12మంది ఉన్నారన్నారు. అలాగే 60కిపైగా నర్సులకు గాను 20మంది నర్సులు ఉన్నారన్నారు. ప్రసూతి సేవలు తప్ప మిగితా ఎటువంటి సేవలు అందడం లేదన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని, ప్రజల సమస్యలు తీరుస్తుందన్నారు. నాయకులు కోలా వెంకటేష్, సాయిబాబాగౌడ్, చిన్నారెడ్డి, మాజీద్, జిమ్మిరవి, మందుల పోశెట్టి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ




ఆర్మూర్‌టౌన్: పట్టణంలో బుధవారం ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లను ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు ఎల్లన్న, మందుల బాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 8న ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ముదిరాజులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు రాజం మహేందర్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మున్సిపల్ వైస్‌చైర్మన్ మహ్మద్ సోహెల్ పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, నాయకులు రవీందర్ యాదవ్, గంగారాం, బీర్కూర్ శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం బీఆర్ఎస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు గూండ్ల, కురుమ, శ్రీ కృష్ణ యాదవ సంఘ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, లింగాగౌడ్, గోవర్ధన్‌గౌడ్, శ్యాం, పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

పసుపు బోర్డు ప్రస్తావన లేదు

వేల్పూర్: నిజామాబాద్‌లో నిర్వహించిన జనగర్జన సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పసుపుబోర్డు, మద్దతు ధర గురించి ప్రస్తావించలేదని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగధర్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ రైతులు మాయమాటల్ని నమ్మరన్నారు. నాయకులు మహిపాల్, రాము, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

'బాల్కొండ' అభివృద్ధి ఆగదు

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి బుక్స్ అందజేస్తున్న మహిళలు

భీమ్‌గల్: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, అసత్య ఆరోపణలు చేసినా బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి ఆగదని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పలు తండాలు, గ్రామాల్లో బుధవారం సుమారు రూ.40 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో గత నాలుగు నెలలుగా అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతుందన్నారు. కొంత మంది అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ చేస్తున్నారని, నియోజకవర్గంలో తాను అభివృద్ధి పనుల కోసం వేసిన శిలాఫలకాలు లెక్కపెట్టడానికే వారికి ఐదేళ్లు పడుతుందని ఎద్దేవ చేశారు. ప్రజలు మళ్లీ నన్ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మహిళలు మంత్రికి బుక్స్ అందజేశారు.

కేటీఆర్ సీఎం కావడానికి మోదీ అవసరం లేదు..

భీమ్‌గల్: సీఎం కేసీఆర్ ఆశీర్వదిస్తే కేటీఆర్ సీఎం అవుతారే గాని.. కేటీఆర్‌ను సీఎం చేయడానికి మోదీ అవసరం, బోడి ఆశీర్వాదం అవసరం లేదని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సికింద్రాపూర్‌లో బుధవారం ఆయన పర్యటించి, మంత్రి మాట్లాడారు. నిజామాబాద్ సభలో ప్రధాని మోదీ వచ్చి అబద్ధాలు మాట్లాడాడని, ఎలాంటి ఆధారాలు లేకుండా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మీద ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి ఆరోపణలు చేయటం సరికాదన్నారు. హెల్త్‌అండ్‌ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మధుశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, నర్సింహనాయుడు ఉన్నారు.

వీధి కుక్కల బెడద తీరేదెలా?

- ఆర్మూర్‌లో గ్రామ సింహాల స్వైరవిహారం
- భయాందోళనలో పట్టణవాసులు



ఆర్మూర్ పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో వీధుల్లో కుక్కల గుంపు

ఆర్మూర్: పట్టణంలోని వివిధ కాలనీల్లో కుక్కల బెడద రోజురోజుకీ పెరిగిపోతోంది. ఈక్రమంలో ఇటీవల చిన్నారులపై కుక్కల దాడులు జరిగిన వార్తలు వచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వీధి కుక్కల బెడద తీరేదెలా అంటూ, అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రాజారాం నగర్ కాలనీ, యోగేశ్వర కాలనీ, టీచర్స్ కాలనీ, మహాలక్ష్మి కాలనీ, హౌజింగ్‌బోర్డు కాలనీ, కమలానెహ్రూకాలనీ, ఆదర్శనగర్, జిరాయత్‌నగర్, పెర్కిట్ కాలనీల్లో పదుల సంఖ్యలో కుక్కలు వీధుల్లో సంచరిస్తున్నాయి. తరచుగా పాదచారులపై కుక్కలు దాడులు సైతం చేస్తున్నాయి. దీంతో కాలనీల్లోని రోడ్లపై పిల్లలు, మహిళలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కల సమస్యపై పలు మార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం..



పట్టణంలోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడద పెరిగిపోతోందని పలు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని నివారించడానికి చర్యలు తీసుకుంటాము.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఎండీఎం కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి





బోధన్‌లో కళ్లకు గంతలు కట్టుకొని మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన.. వర్ని మండలకేంద్రంలో..

బోధన్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన(ఎండీఎం) పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు పట్టణంలో చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా సమ్మె శిబిరంలో వారు కళ్లకు గంతలు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. కార్మికులు రూప, పుష్ప, ఉమా, శ్యాంరావు, లక్ష్మి, గంగమ్మ, ఈశ్వరీ పాల్గొన్నారు.

వర్ని: మండలకేంద్రంలో ఎండీఎం కార్మికులు చేపట్టిన సమ్మెకు బుధవారం ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా నాయకులు విఠల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి





ఆర్మూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న తపాలాశాఖ సిబ్బంది.. నందిపేటలో..

ఆర్మూర్‌టౌన్: తపాలశాఖ బీపీఎంలు, ఏబీపీఎంలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పీఆర్సీ వర్తింప చేయాలని తపాలశాఖ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. ఈమేరకు పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వారు ఒక రోజు సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు లింబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పోస్టాఫీసు ఎదుట తపాల ఉద్యోగులు ధర్నా చేపట్టారు. తపాల ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలన్నారు. సిబ్బంది గంగాదర్‌గౌడ్, నరేష్, సాగర్, సంజీవ్, సాయి, నారాయణ, దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

కేటీఆర్ సభకు తరలిన నాయకులు



వర్ని: బాన్సువాడలో నిర్వహించిన కేటీఆర్ సమావేశానికి బుధవారం ఉమ్మడి వర్ని మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు. స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో కార్యకర్తలు, నాయకులు బాన్సువాడకు బయలుదేరారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: పట్టణంలో ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 61వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



వర్ని: బాన్సువాడలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బుధవారం ముందస్తుగా వర్ని, చందూరు, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో కాంగ్రెస్, ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

విద్యార్థినికి అభినందన



భీమ్‌గల్: బాల్కొండలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో భీమ్‌గల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థిని ప్రణీత స్వర్ణ పతకం సాధించింది. ఈసందర్భంగా విద్యార్థినిని బుధవారం పాఠశాల యాజమాన్యం అభినందించారు.

రాష్ట్రస్థాయి విజేతకు..



మాక్లూర్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ సబ్‌జూనియర్ విభాగంలో మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కూన రక్షిత్ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించాడు. ఈసందర్భంగా బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

వైన్స్‌ను తొలగించాలి



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిల్లోని పీఏసీఎస్ సమీపంలో ఉన్న వైన్స్‌ను తొలగించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు రంజిత్ ఎక్సైజ్ సీఐ స్టీఫెన్‌సన్‌కు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని వెల్మల్ జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ఇద్దరు విద్యార్థులకు కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రోత్సాహక నగదును అందజేశారు. మార్కెటింగ్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచు మచ్చర్ల గంగారాం, ఉప సర్పంచ్ ముప్పెడ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లల విడుదల

నిజామాబాద్‌రూరల్: రూరల్ మండలంలోని మల్లారం గ్రామం నరసింహ చెరువు, ధర్మారం చెరువులో బుధవారం సర్పంచ్ నగేష్, బీఆర్ఎస్ నాయకులు, మత్స్య శాఖ అధికారులు ఒకలక్ష 44వేల 600 చేపపిల్లలను వదిలారు. వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, నాయకులు మధుకర్‌రావు, సుధాకర్, వెంకటేష్, కార్యదర్శి లింగం పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

- బోధన్ మున్సిపల్‌కు నూతన భవనం
- ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్



పాండు చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలోని చెరువులను నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అన్నారు. పట్టణ శివారులోని పాండుచెరువులో బుధవారం మత్స్యకార శాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను ఎమ్మెల్యే వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గంలో గత ఎనిమిదేళ్లలో రూ.450 కోట్ల విలువగల చేపపిల్లలను, రూ. 25కోట్ల విలువగల రొయ్యలను చెరువుల్లో వదిలామన్నారు. మత్స్యకారులకు మోపెడ్‌లతో పాటు ప్రమాద బీమా పథకం కింద రూ. 63లక్షలు చెల్లించామని, దీంతోపాటు నియోజక వర్గంలో 63 కమ్యూనిటీ హాల్స్ కేటాయించామన్నారు. పట్టణంలో రూ. 2కోట్లతో ఫిష్ మార్కెట్ నిర్మాణం కోసం త్వరలో టెండర్లు పిలుస్తామని, చెరువుల వద్ద గంగమ్మ గుడి నిర్మిస్తే తనవంతు సహాయం అందిస్తున్నానన్నారు.

మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ కేటాయించిన రూ. 10కోట్లలో రూ. 5కోట్లతో త్వరలో మున్సిపల్ నూతన భవన నిర్మించుకుందామని, మిగిలిన మరో రూ. 5కోట్లతో పాండు చెరువును టూరిజం పాయింట్‌గా మారుద్దామన్నారు.

మాజీ మంత్రి ఇల్లు ఎందుకు నిర్మించుకోలేదు?

బోధన్ నియోజకవర్గానికి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి బోధన్‌లో ఇల్లు ఎందుకు నిర్మించు కోలేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఒక్క చెరువును సైతం అభివృద్ధి చేయలేదని విమర్శించారు.

లక్షా 13వేల మందికి బతుకమ్మ చీరలు..

రాష్ట్రంలోని ఆడపడుచులకు అన్నగా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నారని, దీనిలో భాగంగా బోధన్ నియోజకవర్గంలో ప్రతి యేటా లక్షా 13వేల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తున్నామన్నారు. పట్టణంలోని రాకాసీపేట్‌లోగల వాటర్ వర్క్స్‌లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మొదటిరోజు పట్టణంలో 20వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే రాకాసీపేట్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడాపరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఎంపీపీ బుద్దె సావిత్రి – రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు రవిందర్ యాదవ్, గంగారాం, శంకర్, కౌన్సిలర్ దూప్‌సింగ్, మహిళా నాయకురాలు మక్కవ్వ, నాయకులు, బోధన్ మత్స్యసహకార సంఘం అధ్యక్షులు కోట అబ్బయ్య, కార్యదర్శి మామిడి గంగాధర్, గంగ పుత్ర సంఘం అధ్యక్షులు భూమయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

బోధన్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పూజారి లింగం బుధవారం ఎమ్మెల్యే షకీల్ నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. లింగంకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

మొరం అక్రమదందాపై ఫిర్యాదు



మాక్లూర్: మండలంలోని మాదాపూర్ గుట్ట నుంచి మొరం అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోని, మొరం తరలింపును నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌కు వినతిపత్రం అందించారు. మొరం తరలింపుతో మాదాపూర్ గుట్ట ఇప్పటికే 75 శాతం ఖాళీ అయిందని, అధికారులు స్పందించకుంటే పచ్చని చెట్లతో కూడిన అడవి మాయం అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మొరం తరలించగా ఏర్పడిన ఖాళీ స్థలాన్ని సైతం మొరం వ్యాపారులు కబ్జాలు చేస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆశా వర్కర్ల వినూత్న నిరసన



మాక్లూర్‌లో భిక్షాటన చేస్తున్న ఆశా వర్కర్లు



వర్నిలో..

మాక్లూర్/బోధన్/వర్ని: తమ సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వర్ని, మాక్లూర్ మండలాల్లో ఆశా వర్కర్లు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఆయా మండల కేంద్రాల్లో భిక్షాటన చేస్తూ, ప్రభుత్వ మొండి వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైన స్పందించి రూ: 18వేల వేతనం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అలాగే బోధన్‌లో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు బైఠాయించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

సమాచారం..

11న మండల సర్వసభ్య సమావేశం

నవీపేట: మండల కేంద్రంలో ఈనెల 11న ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలు అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు బతుకమ్మ చీరల పంపిణీ

బాల్కొండ: బాల్కొండ, మెండోరా మండలాల పరిధిలో గురువారం మండల పరిషత్ కార్యాలయాల వద్ద బతుకమ్మ చీరల పంపిణీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అర్వింద్.. ఆర్మూర్‌లో పోటీ చెయ్

- మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: బాండ్ పేపర్ ఎంపీ అర్వింద్ పొలిటికల్ ఎండ్ పేపరని.. దమ్ముంటే ఆర్మూర్‌లో నా మీద పోటీ చేయాలని.. డిపాజిట్ రాకుండా ఓడిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమేనన్నారు. పసుపు బోర్డు ఒక బూటకం, ఇదో ఎన్నికల నాటకమన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఉండదు, మోదీ మాటల్లో నిజం ఉండదన్నారు. సుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పంచరెడ్డి సూరీ, రజనీష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫుక్రే-3 (హిందీ) - 12.30, 7.10, 10.25 జవాన్ (తెలుగు)- 3.45
స్క్రీన్-2 –	స్కంద - 11.00, 2.30, 6.00, 9.30
స్క్రీన్-3 –	పెదకాపు1- 12.40, 7.20, 10.30 స్కంద - 03.50
స్క్రీన్-4 –	చంద్రముఖి2 (తెలుగు)- 11.45, 3.05, 6.25, 9.45

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

ఖలీల్‌వాడి: యువత మత్తుపదార్థలకు దూరంగా ఉండాలని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర, మానసిక వైద్యనిపుణులు, ఇండియన్ సైకియాట్రిక్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో బుధవారం మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో మానసిక వైద్యంపై అవగాహన లేకపోవడంతో చాల మంది నష్టపోతున్నారన్నారు. మానసిక వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలన్నారు. వైద్యులు శివప్రసాద్, రాజేందర్, రాజశేఖర్, రవితేజ, ప్రదీప్ ఉన్నారు.

శంభునిగుడి హుండీ లెక్కింపు



నిజామాబాద్ సిటీ: నగరంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ కానుకలను లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ, ఈవో రాంరవీందర్‌గుప్తాల ఆధ్వర్యంలో హుండీను తెరిచారు. కానుకలను లెక్కించగా మొత్తం రూ.89,599లు ఆదాయం వచ్చినట్లు సుప్రియ తెలిపారు.